క్లుప్తంగా

రేపటి నుంచి మహాభారతయజ్ఞం



మహాభారతయజ్ఞం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

పీలేరు రూరల్ : స్థానిక ఆర్టీసీ డిపో ప్రాంగణంలో ఆదివారం నుంచి ఈ నెల 27వ తేదీ వరకు 18 రోజుల పాటు మహా భారతయజ్ఞం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ఉదయం ధ్వజారోహణంతో యజ్ఞం ప్రారంభమవుతుందన్నారు. పగలు హరికథాకాలక్షేపం బంగారుపాళెంకు చెందిన భాగవతారిణి రెడ్డికుమారి, రాత్రి నాటకాలు శ్రీ వెంకటేశ్వర నాట్య కలామండలి మల్లికార్జున బృందంచే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహాభారత యజ్ఞాన్ని ప్రజలు విజయవంతం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కందుకూరు సమీపంలోని చేలూరు రోడ్డులో శుక్రవారం ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న కందుకూరుకు చెందిన అంజాద్ (40), దర్బార్ (43) గాయపడ్డారు. వెంటనే 108 వాహనం ద్వారా మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులు కర్నాటక రాష్ట్రంలోని చేలూరుకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని గ్రామస్థులు పేర్కొన్నారు.

గంగమ్మ ఆలయంలో రాహుకాల పూజలు



పూజలు చేస్తున్న మహిళలు

మదనపల్లె సిటీ: స్థానిక కోర్టు ఆవరణంలోని కోర్టులో గంగమ్మ ఆలయంలో శుక్రవారం రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు దీపాలతో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, బీ.కె.పల్లి భక్తాదులు పాల్గొన్నారు.


మల్లయ్యకొండపై 'చింతల' ప్రత్యేక పూజలు



పూజ కార్యక్రమంలో చింతల రామచంద్రారెడ్డి

తంబళ్లపల్లె: మండల కేంద్రానికి సమీపంలోని మల్లయ్యకొండపై వెలసిన శ్రీభమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయాన్ని శుక్రవారం పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సందర్శించారు. ప్రత్యేక పూజలు చేశారు. పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జున ఆయనకు స్వాగతం పలికి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. మల్లయ్యకొండ ఆలయ అభివృద్ధిపై సంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రయాణికుల మన్ననలు పొందాలి



డీఎం నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న ఆర్టీసీ సిబ్బంది

మదనపల్లె సిటీ: ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికుల మన్ననలు పొందాలని ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి సూచించారు. శుక్రవారం మదనపల్లె-1 డిపోలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ జరిగింది. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తే సంస్థకు పేరు వస్తుందన్నారు. దీంతో ఆదాయం కూడా పెరుగుతుందని పేర్కొన్నారు. అధిక ఆదాయం సాధించిన కె.సి.మస్తాన్, గంగాధరం, పి.వి.రమణ, అత్యధిక ఈపీకే తెచ్చిన కండక్టర్లు, టిమ్ డ్రైవర్లు సూపర్ లగ్జరీ ఏ.హెచ్.కృష్ణ, ఎక్స్‌ప్రెస్ పి.వి.రమణ, పల్లె వెలుగు బిసి నాయక్, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ట్రాఫిక్ సూపర్‌వైజర్ గంగన్న, గ్యారేజీ మెకానిక్ చలపతి, డీజిల్ ఆదా చేసిన డ్రైవర్ పీఆర్ శేఖర్‌కు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీఐ రేవతి, ఎంఎఫ్ రవి సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఎల్లమ్మ జాతర

పెనగలూరు: మండల కేంద్రంలో కొలువైన ఎల్లమ్మ తల్లి జాతరను శని, ఆదివారాలలో నిర్వహించనున్నట్లు ఆలయ పూజారులు సుబ్బనరసయ్య, పెంచలయ్యలు తెలిపారు. పెనగలూరులో వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 16వ తేదీ నుంచి ప్రారంభమవుతుండటంతో ఆదివారం ఎల్లమ్మ జాతరను జరుపనున్నారు. శనివారం అమ్మవారికి పూజలు, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

పుస్తక పఠనం.. జ్ఞాన సాధనం

'చిరిగిన చొక్కా అయినా తొడుక్కో.. కానీ ఓ మంచి పుస్తకం కొనుక్కో' అన్నాడో మహానుభావుడు. ఒక్క పుస్తకం తోడుంటే.. అనంత జ్ఞానం మన సొంతం అన్నారు మరొకరు. విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంచేందుకు వేసవి సెలవుల్లో గ్రంథాయాలల్లో సమ్మర్ క్యాంపులు నిర్వహించారు. ఈ శిబిరాల్లో పిల్లలకు వినోదం పాటు విజ్ఞాన్ని అందించారు. చిన్నారుల్లో ఆసక్తిని బట్టి క్యారమ్స్, చెస్‌తో పాటు ఆటల పోటీలు కూడా నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. 40 రోజుల పాటు సాగిన ఈ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది.

- గ్రంథాలయాల్లో ముగిసిన సమ్మర్ క్యాంపులు
- ఉత్సాహం పాల్గొన్న విద్యార్థులు
- చిన్నారులకు బహుమతులు ప్రదానం



గుర్రంకొండ గ్రంథాలయంలో విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంఈఓ సుబ్రమణ్యం

మదనపల్లె సిటీ: గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానికశాఖ గ్రంథాలయంలో ఉచిత వేసవి శిక్షణా తరగతులు ముగింపు కార్యక్రమం జరిగింది. మే 5 నుంచి జూన్ 7 వరకు కొనసాగిన ఉచిత వేసవి శిక్షణా తరగతులు విద్యార్థులు సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. విద్యార్థులు పుస్తకాలు పుస్తకాలు చదవడం అలవర్చుకుంటే జ్ఞానాన్ని పొందవచ్చునన్నారు. గ్రంథాలయ అధికారిణి వసంతకుమారి మాట్లాడుతూ విశ్రాంత ఉపాధ్యాయులు, రచయితలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి శిక్షణ ఇచ్చారన్నారు. శిక్షణలో నేర్చుకున్న వివిధ అంశాలను విద్యార్థులు ప్రదర్శించారు. విద్యార్థులకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. ప్రజా చైతన్య ప్రవంతి అధ్యక్షులు గొల్లపూడి తిరుపతిరావు, బీటీ కాలేజీ కరస్పాండెంట్ వై.ఎస్.మునిరత్నం, రచయితలు టీ.ఎస్.ఎ.కృష్ణమూర్తి, యుగంధరాచారి, రెడ్డప్ప, మునిగోపాలకృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

కలకడ : కలకడ గ్రంథాలయశాఖలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మెమొంటో, సర్టిఫికెట్‌లు అందజేసినట్లు గ్రంథాలయ అధికారి అమరనాథ్ తెలిపారు. వేసవి శిబిరంలో చిన్నారులకు కథలు చెప్పడం, డ్రాయింగ్ వేయడం, క్యారమ్స్, చెస్ వంటి ఆటలలో శిక్షణ ఇచ్చామని తెలిపారు.

గ్రంథాలయాలు విజ్ఞాన బాంఢాగారాలు

గుర్రంకొండ: గుర్రంకొండలో తెలుగు గ్రంథాలయంలో నెల రోజులుగా నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమం ముగిసింది. శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు పలు వ్యాసరచన, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎంఈఓ సుబ్రమణ్యం బహుమతులు, సర్టిపికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన బాంఢాగారాలన్నారు. గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని ఎందరో మహనుభావులు ఉన్నత స్థాయికి చేరుకొన్నారని గుర్తుచేశారు. పిల్లలు ఇప్పటి నుంచే గ్రంథాలయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి రెడ్డికుమారి, హైస్కూల్ ఉపాధ్యాయులు త్రినాథ్, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

పఠనం జీవితంలో భాగం కావాలి

బి.కొత్తకోట: పుస్తక పఠనం ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని ఎంఈఓ రెడ్డిశేఖర్ అన్నారు. శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిబిరం ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు ధ్రువపత్రాలను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ అజ్ఞాన్ని అక్షరమనే ఆయుధంతో జయించవచ్చని అన్నారు. వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవడం ఎంతో ప్రయోజనకరమని అన్నారు. ఎంఈఓ-2 భీమేశ్వరాచారీ, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శీను నాయక్, హెచ్ఎం భాస్కర్, గ్రంథాలయాధికారి తులసీనాయక్ పాల్గొన్నారు.



బి.కొత్తకోట: విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న రెడ్డిశేఖర్



మదనపల్లె సిటీ: మాట్లాడుతున్న గొల్లపూడి తిరుపతిరావు



కలకడ : విజేతలకు బహుమతులు అందజేస్తున్న అమరనాథ్

ధరఖాస్తుల ఆహ్వానం

కలికిరి: మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను 6, 7, 8, 9వ తరగతిలో మిగిలిన ఖాళీల భర్తీ కొరకు నిర్వహించే ప్రవేశపరీక్షకు అర్హులనుంచి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ ప్రిన్సిపాల్ వై.సోమశేఖర్ తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 15వ తేదీ లోపు పాఠశాల వెబ్‌సైట్‌లో ధరఖాస్తు చేసుకోవాలని, ఈ నెల 20న ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు దగ్గరలోని ఏపీఎంజేపీ గురుకుల పాఠశాలల్లో సంప్రదించవచ్చని, ప్రవేశ ప్రకటనకు పాఠశాల వెబ్‌సైట్‌లో చూడవచ్చని, మరిన్ని వివరాలకు జిల్లా కన్వీనర్ ప్రిన్సిపాల్ మొబైల్ 9000715637 నంబరును సంప్రదించవచ్చన్నారు.

వాల్మీకిపురం: ఏపీ మైనార్టీ బాలికల గురుకుల కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్ గెస్టు ఫ్యాకల్టీ పోస్టుకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ రమామంజుల తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీడీ గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు ఎంపీఈడీ కలిగిన మహిళా అభ్యర్థుల దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వర్షం రాకతో రైతుల్లో ఆనందం



దుక్కులకు సిద్ధంగా ఉన్న పొలం

పుల్లంపేట : గతంలో ఎన్నడూ లేని విధంగా ఎండలు ఈ ఏడాది అధికమయ్యాయి. దీంతో కొన్ని గ్రామాలలో సాగు, తాగునీటి సైతం ప్రజలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వృద్ధులు, గర్భిణులు ఎండవేడిమికి తట్టుకోలేక అవస్థలు పడ్డారు. జూన్ మాసం వచ్చేసరికి వాతావరణం చల్లబడి అడపాదడపా వర్షం కురవడంతో రైతుల్లో ఆనందం మొదలైంది. ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసేందుకు దుక్కులు వేసుకునేందుకు రైతులు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. తమలపాకు, అరటి, బొప్పాయి తదితర పంటలను సాగు చేసేందుకు రైతులు మొగ్గుచూపుతున్నారు.

క్షయ నిర్మూలన అందరి బాధ్యత



వాల్మీకిపురం: రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డాక్టర్ లక్ష్మి



కలకడ : కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి

కలకడ : క్షయ వ్యాధి నిర్మూలన అందరి బాధ్యత అని డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. క్షయ వ్యాధి నిర్మూలించేందుకు వయోజనులకు బీసీజీ టీకాలు ఉచితంగా వేస్తున్నామని తెలిపారు. శుక్రవారం మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ పరిధిలోని సింగొడ్డుపల్లె, బొజ్జగుంటపల్లె, చెరువుముందరపల్లె, ముడియంవారిపల్లె గ్రామాల్లో నిర్వహిస్తున్న బీసీజీ టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేసి గ్రామస్తులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీజీ టీకాలు వేసుకోవడం వలన వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ పరిధిలో 7,751 మంది వయోజనులు ఉన్నట్లు గుర్తించామని, ఇప్పటివరకు 666 మందికి టీకాలు వేశామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ జయరామయ్య, పీహెచ్ఎన్ సుబ్బరత్న, సూపర్‌వైజర్ రెడ్డెమ్మ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బీసీజీ టీకాతో క్షయ నివారణ

నిమ్మనపల్లె : బీసీజీ టీకాతో క్షయ నివారణ సాధ్యమవుతుందని హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, టీబీ పర్యవేక్షకులు నాగిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రెడ్డివారిపల్లె రాచవేటివారిపల్లె గ్రామాల్లో బీసీజీ టీకాపై అవగాహన కార్యక్రమాన్ని మండల వైద్యాధికారి దీక్షిత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామాలలో అవగాహన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీబీ నివారణ కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన వయోజన బీసీజీ టీకా టీబీ మరణాల తీవ్రతను తగ్గిస్తుందన్నారు. అపోహలకు గురికాకుండా టీకా వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు దేవేంద్ర, ఎమ్.ఎల్.హెచ్.పి. ప్రసూన, ఏఎన్ఎమ్‌లు కవిత, మమత పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సిన్ తప్పనిసరి

వాల్మీకిపురం: అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేసుకోవాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ లక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని చింతపర్తి పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. అలాగే చారావాండ్లపల్లిలో 104ను ఆమె తనిఖీ చేసి, బీసీజీ వ్యాక్సిన్ వేసుకోవాలని ప్రజలకు సూచించారు. డాక్టర్ శ్రీవిద్య, సనా ఆయేషా, సీహెచ్ఓ ఇందిరారాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న రథోత్సవం



గట్టు వీధుల్లో ఊరేగుతున్న రథోత్సవం

బి.కొత్తకోట: మండలంలోని గట్టులో వెలసిన ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజు శుక్రవారం రథోత్సవం వైభవంగా జరిగింది. ఆలయంలో ఉదయం నుంచి వందల సంఖ్యలో తరలివచ్చిన భక్తుల దర్శనంతో ఆలయం కిటకిటలాడింది. అభిషేకాలు, అర్చనలు, పూజలు జరిగాయి. అనంతరం ప్రసన్న వేంకటేశ్వరుడు, శ్రీదేవి, భూదేవి సమేత ఉత్సవ మూర్తులను రథంలో కొలువుదీర్చారు. ఆలయ ప్రాంగణం నుంచి రథోత్సవం ప్రారంభమైంది. భక్తులు రథాన్ని తాడుతో లాగుతూ గోవింద నామస్మరణ చేశారు. గట్టు వీధుల్లో రథోత్సవం కన్నులపండువగా సాగింది. వీధులను నీళ్లతో శుభ్రపరస్తూ భక్తులు అడుగడుగునా పూజలు చేశారు. అన్నివీధుల్లో తిరిగాక రథాన్ని ఆలయ ప్రాంగణానికి తీసుకొచ్చి కార్యక్రమాన్ని ముగించారు. టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు ఎ.సుబ్రమణ్యం, టీడీపీ నియోజక వర్గ నేత డి.జయచంద్రారెడ్డి, బీజేపీ నేత చల్లపల్లె నరసింహారెడ్డి, మాజీ ఎంపీపీ సుధాకర్‌బాబు, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు శెట్టి నాగలాంబిక ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు, కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గట్టు, పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు, స్థానిక వైఎస్సార్‌సీపీ, టీడీపీ, బీజేపీ నాయకులు రథోత్సవంలో పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ సభ్యులు

మదనపల్లె : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీలకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వర్రి సురేష్‌కుమార్ వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికులకు సంబంధించి ఈపీఎఫ్, ఈఎస్ఐ సమస్యలను పరిష్కరించాలని కోరారు. పట్టణ జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. కరోనా సమయంలో విధులకు తీసుకున్న కార్మికులను అవుట్‌సోర్సింగ్ కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ స్కూల్ స్వీపర్లకు వేతనాలతో పాటు, స్వీపర్ల ఈపీఎఫ్, ఈఎస్ఐ పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అవసరమైన పనిముట్లను పారిశుద్ధ్య కార్మికులకు పంపిణీ చేయాలన్నారు. చనిపోయిన కార్మికుల కుటుంబసభ్యులకు ఉద్యోగంతో పాటు ఎక్స్‌గ్రేషియా, పెన్షన్ విధానాన్ని కల్పించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సభ్యులు నాగరాజు, వాసు, పృథ్వీరాజ్, లోకేష్, ఓబులేసు, నందు, శేఖర్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కరించండి

మదనపల్లె : మండలంలోని చిన్నతిప్పసముద్రం చెంచులక్ష్మి యానాది కాలనీలో విద్యుత్ సమస్య పరిష్కరించాలని సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జి కృష్ణప్ప, ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుక్కే విశ్వనాథనాయక్ కోరారు. శుక్రవారం స్థానిక ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ కార్యాలయంలో డీఈ సురేంద్రనాయక్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యానాది కాలనీలో 20 ఏళ్లుగా విద్యుత్‌లైన్, పోల్స్ లేకపోవడంతో వారే సొంతంగా వైర్లను ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ ద్వారా మీటర్లు అమర్చుకున్నప్పటికీ వీధి దీపాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వర్షాకాలంలో గాలులకు వైర్లు తెగి, ఇళ్ల మీద పడటంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. దీనిపై విద్యుత్ అధికారులు స్పందించి తక్షణం లైన్లు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, పట్టణ కార్యదర్శి తిరుమల, వ్యవసాయ కార్మికసంఘం నాయకులు కే.సిద్ధయ్య, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు మురళి తదితరులు ఉన్నారు.

ఎస్సీ వసతి గృహాల పరిశీలన

లక్కిరెడ్డిపల్లె : లక్కిరెడ్డిపల్లెలోని ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాలను శుక్రవారం సాంఘిక సంక్షేమశాఖ ఇన్‌చార్జ్ డిప్యూటీ డైరెక్టర్ రామసుబ్బయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న వసతి గృహాలు శిథిలావస్థలో ఉన్నందున పిల్లలు సక్రమంగా ఉండడం లేదని, అందుకు వేరే కొత్త బిల్డింగ్‌లోకి మార్చేందుకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపనున్నట్లు వారు తెలియజేశారు. కొత్త మెనూతోపాటు విద్యార్థులకు నోటుపుస్తకాలు, విద్యాసామగ్రి అందిస్తామని తెలిపారు. అనంతరం వసతి గృహాల్లోని రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వార్డెన్లు శ్రీనివాసులు, రమేష్, స్వాతి, సిబ్బంది పాల్గొన్నారు.

చర్యలు తప్పవు

సిద్దవటం : ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యాకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిద్దవటం ఎస్ఐ పెద్ద ఓబన్న హెచ్చరించారు. సిద్దవటం మండలంలోని మాచుపల్లె, సిద్దవటం గ్రామాలోని ప్రజలకు శుక్రవారం ఆయన కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదన్నారు. గొడవలు సృష్టించవద్దన్నారు.

ఏపీటీడీసీ డైరెక్టర్ పదవికి రాజీనామా



భాస్కర్‌రెడ్డి

బి.కొత్తకోట: రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ డైరెక్టర్ మిట్టపల్లె భాస్కర్‌రెడ్డి ఆ పదవికి రాజీనామా చేస్తూ ఆ శాఖ ఎండీ కన్నబాబుకు లేఖ పంపారు. బి.కొత్తకోట మండలం కోటిరెడ్డిగారిపల్లెకు చెందిన భాస్కర్‌రెడ్డి మూడేళ్లకుపైగా డైరెక్టర్‌గా ఉన్నారు. సంస్థ పాలక మండలి సబ్‌కమిటికి చైర్మన్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. ఈ రెండు పదవులను వదులుకొంటూ రాజీనామా చేశారు. కాగా తంబళ్లపల్లె మల్లయ్యకొండపై టూరిజం ద్వారా రూ.4 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సహకారంతో కృషి చేశారు. సంస్థ ఎండీ, సాంకేతిక అధికారుల సహకారంతో పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ అభివృద్ధికి భాస్కర్‌రెడ్డి కృషి చేశారు.

పీలేరు : వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ మండల కన్వీనర్ పదవికి, పీలేరు 5వ గ్రామ సచివాలయ కన్వీనర్ పదవికి రాజీనామా చేసినట్లు కాలనీ చిన్న అలియాస్ మునీంద్ర తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వ్యక్తిగత కారణాలతో ఎస్టీ సెల్ మండల కన్వీనర్ పదవికి, గ్రామ సచివాలయ కన్వీనర్ పదవికి రాజీమా చేసి రాజీనామా పత్రం పార్టీ అధిష్టానానికి పంపినట్లు తెలిపారు.

బీడుబారిన చెరువులు.. నైరుతిపైనే ఆశలు


- లేకుంటే భారంగానే ఖరీఫ్ సాగు
- నైరుతి రుతుపవనాల వర్షాలతోనే భూగర్భ జలాల పెరుగుదల
- ఆరుద్ర కార్తికు సాగుకు సిద్ధమవుతున్న రైతన్నలు



నీరులేక దర్శనమిస్తున్న రాజంపేట మండలంలోని పోలి చెరువు

రాజంపేట టౌన్ : రాష్ట్రంలో నైరుతి ప్రవేశించి అనేక ప్రాంతాల్లో జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో సైతం పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసి చెరువుల్లోకి సైతం ఓ మోస్తారు నీళ్లు చేరాయి. అయితే రాజంపేట మండలంలో నైరుతి ప్రభావం ఏమాత్రం లేకపోవడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. మృగశిర కార్తి శుక్రవారం నుంచి ప్రారంభమైంది. ఈ కార్తి నాటికి ఓ మోస్తారు వర్షాలు కురిసి ఉండాలి. అయితే కనీసం భూమి తడిచేతంటి వర్షం కూడా కురవకపోవడం, మరో రెండు వారాల్లో ఆరుద్ర కార్తి కూడా ప్రారంభం కానున్న నేపథ్యంలో ఖరీఫ్ సాగు ఎలా అని రైతన్నలు ఆలోచనలో పడ్డారు. కాగా 2021వ సంవత్సరం నవంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పోలి చెరువు, కృష్ణమ్మ, ఆకేపాడు, మన్నూరు, ఊటుకూరు, హస్తవరం తాళ్లపాక చెరువులు నిండి అలుగులు పారాయి. అయితే గత రెండు సంవత్సరాలుగా సరైన వర్షాలు కురవకపోవడంతో మండలంలో ఏ చెరువూ నిండలేదు. ఈ కారణంగా మండలంలోని అన్ని చెరువులు ఎండిపోయాయి. మండలంలో అతిపెద్ద చెరువు పోలి చెరువు. ఈ చెరువు నిండి అలుగు పార్లితే దాదాపు రెండు సంవత్సరాలపాటు రాజంపేట పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు సంవృద్ధిగా ఉంటాయి. ఈ కారణంగా ప్రజలకు తాగునీటికి, రైతన్నల సాగునీటికి ఇబ్బందులు ఉండవు. చెరువులన్ని ఎండిపోవడంతో భూగర్భ జలాలు బాగా అడుగంటిపోయాయి. ప్రస్తుతం నైరుతి ప్రభావం రాజంపేట పరిసర ప్రాంతాల్లో జాడ కూడా లేకపోవడంతో అటు ప్రజలు, ఇటు రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నైరుతిలో ఓ మోస్తారు వర్షాలు కురిస్తే చెరువుల్లోకి కొద్దిపాటి నీళ్లు చేరినా భూగర్భ జలం వృద్ధి చెందుతుందని, ఆ తరువాత వర్షాకాలంలో వర్షాలు కురిస్తే చెరువులు నిండుతాయని ప్రజలు, రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. రానున్న రోజుల్లో అయినా రుతుపవనాల ప్రభావం వల్ల మండలంలో వర్షాలు కురిస్తేనే రైతులు మరో రెండు వారాల్లో ప్రారంభం కానున్న ఆరుద్ర కార్తిలో వరి, అరటి పంట సాగుకు సిద్ధంకాగలరు. ఆరుద్ర కార్తిలో పంటలకు తెగుళ్లు కూడా తక్కువ సోకే అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు. అందువల్ల నైరుతి ప్రభావం వల్ల మంచి వర్షం కురిస్తే చెరువుల్లోకి కొద్దిపాటి నీళ్లు చేరినా పంటలను సాగు చేసేందుకు వీలవుతుంది. గత రెండేళ్లుగా సరైన వర్షాలు లేని కారణంగా రైతులు చెప్పుకోదగ్గ స్థాయిలో పంటలను సాగు చేయలేకపోయారు. అయితే ఈ ఏడాది వర్షాలు సంవృద్ధిగా కురుస్తాయని వాతావరణశాఖ అధికారులు ఇప్పటికే వెల్లడించారు. అధికారులు వర్షాలు బాగా కురుస్తాయన్న మాటలు రైతులకు ఆనందం కలిగిస్తున్నప్పటికీ నైరుతి ఆశాజనకంగా లేకపోవడంతో వారిని తీవ్ర నిరాశకు గురిచేస్తోంది.

ఏమిచేయాలో పాలుపోవడం లేదు



మండలంలో నైతుతి ప్రభావం ఏమాత్రం లేదు. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో కురిసే వర్షం అయినా ఇక్కడ కురవడం లేదు. నేను ఆరుద్ర కార్తిలో పంటలు సాగు చేసేందుకు సిద్ధంగా ఉన్నా. అయితే వర్షం జాడ అన్నదే లేదు. ఏమిచేయాలో పాలుపోవడం లేదు.

- ఆకేపాటి కృష్ణారెడ్డి, రైతు, హస్తవరం, రాజంపేట మండలం